

ఎప్పుడైనా కలవొచ్చు...

ప్రజల ప్రతినిధిగా సమస్యల పరిష్కారం కోసం తనను ఎప్పుడైనా కలవొచ్చని ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి వెల్లడించారు. 8లో



టీ.టీ. జట్ల ఎంపిక

రాష్ట్రస్థాయిలో పాల్గొననున్న ఉమ్మడి జిల్లా టేబుల్ టెన్నిస్ బాలురు, బాలికల జట్లను ఖమ్మంలో ఎంపిక చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం

32° / 24°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉదయం వాతావరణం చల్లగానే ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరిగినా సాయంత్రం చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఆరు లే ఔట్లకు అనుమతి



గూగుల్ మ్యాప్ ద్వారా పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా స్థాయి సమావేశంలో ఆరు లే ఔట్లకు అధికారులు అనుమతులు జారీ చేశారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య అధ్యక్షతన శనివారం ఈ సమావేశం జరిగింది. ఈమేరకు 'సుడా' పరిధిలో 18 వెంచర్లకు సంబంధించి పత్రాలను పరిశీలించగా ఆరింటికి అనుమతి జారీ చేశారు. మరో రెండింటికి సంబంధించి అవసరమైన ధ్రువపత్రాలు జత చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, ఎన్పీడీసీఎల్, సర్వే లాండ్ రికార్డ్స్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు అప్రెంటిస్‌షిప్ మేళా

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 21న జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో హైదరాబాద్‌కు చెందిన ఎంఎన్‌సీలతో జిల్లాకు చెందిన కంపెనీల బాధ్యులు పాల్గొంటారని పేర్కొన్నారు. అన్ని ట్రేడ్లలో ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ కాపీతో పాటు ఎస్సెస్సీ, ఐటీఐ మెమోలు, కుల ధ్రువీకరణపత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఐటీఐలో హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఘనంగా కళా ఉత్సవ్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఖమ్మంసహకారనగర్: జిల్లా కేంద్రంలోని సైన్స్ మ్యూజియంలో శనివారం కళా ఉత్సవ్ నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల నుంచి 9వ తరగతి మొదలు ఇంటర్ వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వోకల్ మ్యూజిక్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, విజువల్ ఆర్ట్స్ ఫార్మ్స్, నృత్యం, థియేటర్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కాగా, రాష్ట్ర స్థాయి పోటీలు వచ్చేనెల 1, 2వ తేదీల్లో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ప్రతీ విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న డీఐఈఓ రవిబాబు

ముదిగొండ: ఇంటర్ విద్యార్థులు వార్షిక పరీక్షలకు సిద్ధమవుతూనే ఇంజనీరింగ్, మెడికల్ ప్రవేశ పరీక్షలపై కూడా దృష్టి సారించాలని జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాధికారి రవిబాబు సూచించారు. ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం సందర్శించిన ఆయన హాజరుశాతాన్ని పరిశీలించాక విద్యార్థులతో మాట్లాడారు. సైన్స్ విద్యార్థులు ఎప్‌సెట్, నీట్‌లో ర్యాంకులు సాధించేలా ఇప్పటి నుంచే సాధన మొదలు పెట్టాలని తెలిపారు. అలాగే, ఆర్ట్స్ గ్రూప్‌ల విద్యార్థులు జాతీయ స్థాయి యూనివర్సిటీల్లో సీట్లు సాధించాలని, తదితరులు మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. కాగా, గ్రంథాలయంనుంచి విద్యార్థులకు ఎప్‌సెట్, నీట్ పుస్తకాలు ఇవ్వాలని అధ్యాపకులకు సూచించిన డీఐఈఓ.. విద్యార్థుల హాజరుపై దృష్టి సారించి మెరుగైన బోధన చేయాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ వి.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు

ఖమ్మంమయూరిసెంటర్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ఖమ్మం మార్కెట్ వ్యాల్యూ, ఆడిట్ సబ్ రిజిస్ట్రార్ ఏ.విజయజ్యోతిని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక సత్తుపల్లి సబ్ రిజిస్ట్రార్ మోసెస్ భాస్కర్‌ను ఇటీవల ఉప్పల్‌కు బదిలీ చేయగా.. తిరిగి ఆయనను సత్తుపల్లి సబ్ రిజిస్ట్రార్‌గానే కొనసాగాలని ఉత్తర్వుల్లో తెలిపారు.

రా రమ్మని.. రారా రమ్మని!



ఖమ్మం మార్కెట్ ప్రధాన ద్వారం

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పోస్టుల భర్తీలో జాప్యం జరుగుతుండడంతో ఆశావహులకు ఎదురు చూపులు తప్పడం లేదు. ఈక్రమంలోనే వ్యవసాయ మార్కెట్ కమిటీలపై ఆశలు పెట్టుకున్న నేతలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. జిల్లాలో ఎనిమిది వ్యవసాయ మార్కెట్లకు గాను నాలుగింటికి పాలక వర్గాలు ఏర్పాటయ్యాయి. ఇంకా నాలుగు కమిటీలు భర్తీ చేయాల్సి ఉండడం.. ఇటీవల నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశం తెరపైకి రావడంతో పదవులు ఆశిస్తున్న వారు పట్టువీడకుండా ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ఖమ్మం చైర్మన్‌గిరీ ఎవరికి?

ఖమ్మం మార్కెట్ చైర్మన్ గిరీ తమకేనన్న ధీమా పలువురు ఆశావహుల్లో వ్యక్తమవుతోంది. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండడం.. ఇప్పటికే మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయించడంతో చైర్మన్‌గా ఎవరిని నియమిస్తారోనన్న చర్చ జోరుగా సాగుతోంది. పార్టీ గెలుపు కోసం కష్టపడ్డామని, అధికారంలో లేకున్నా పార్టీని వీడని తమకే చైర్మన్ పదవి ఇవ్వాలని పలువురు మంత్రిని కలిసి విన్నవించుకున్నట్లు సమాచారం. కానీ మంత్రి దృష్టిలో ఎవరు ఉన్నారోననే అంశంపై ఎడతెగని ఉత్కంఠ సాగుతోంది. రాష్ట్రంలోని పలు మార్కెట్లకు చైర్మన్లను నియమిస్తున్నా ఖమ్మం పెండింగ్‌లో ఉండడంతో నేతల్లో టెన్షన్ నెలకొంది.

నేతలను ఊరిస్తున్న మార్కెట్ కమిటీలు

- ఇప్పటికే నాలుగు మార్కెట్లకు పాలకవర్గాల ఏర్పాటు
- పెండింగ్‌లో మరో నాలుగు.. ఆశావహుల ముమ్మరయత్నాలు
- ఏజెన్సీలో ఉన్న ఏన్కూరుపై సందిగ్ధత

నాలుగు కమిటీల నియామకం

జిల్లాలో ఖమ్మం, వైరా, మధిర, ఏన్కూరు, సత్తుపల్లి, కల్లూరు, మద్దులపల్లి, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్లు ఉండగా సత్తుపల్లి, కల్లూరు, మద్దులపల్లి, నేలకొండపల్లి మార్కెట్ కమిటీల పాలకవర్గాల నియామకం పూర్తయింది. ఈమేరకు పాలకవర్గాలు ప్రమాణస్వీకారం కూడా చేశాయి.

పగ్గాలు చేజిక్కించుకోవాలని..

జిల్లాలో నాలుగు మార్కెట్లకు కమిటీలను నియమించాల్సి ఉంది. తాజాగా నామినేటెడ్ పోస్టుల భర్తీ కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కసరత్తు ప్రారంభించారు. ఈనేపథ్యాన కొన్ని పోస్టులతో కూడిన జాబితాను ఆయన అధిష్టానం ఆమోద ముద్ర కోసం హస్తిన తీసుకెళ్లారు. ఈక్రమంలో మార్కెట్ కమిటీల నియామకంపైనా చర్చ మొదలైంది. మార్కెట్ చైర్మన్‌గిరీని దక్కించుకునేందుకు నియోజకవర్గాల నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. నమ్ముకున్న నేతలతో పాటు మంత్రులను కలిసి తమ అర్హతలను ఏకరువు పెడుతున్నారు. పార్టీ కోసం పడిన కష్టాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలకు వివరిస్తూ తమకు పదవి దక్కేలా చేయాలని కోరుతున్నారు.

మంత్రుల ఇలాఖాల్లో..

ఖమ్మం, మధిర, వైరా, ఏన్కూరు మార్కెట్ కమిటీల నియామకం చేపట్టాల్సి ఉండగా.. ఖమ్మం, మధిర మార్కెట్లపై కాంగ్రెస్‌లోని పలువురు నాయకులు కన్నేశారు. ఖమ్మం మార్కెట్ రాష్ట్రంలోనే పెద్దది కావడం, జిల్లా కేంద్రం కావడంతో చైర్మన్ పదవి కోసం నేతలు ఉవ్విళ్లూరుతున్నారు. మరోవైపు ఖమ్మం, మధిర మార్కెట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో ఉండడంతో ప్రాధాన్యత ఏర్పడింది. ఇక వైరా మార్కెట్ కమిటీ దక్కించుకునేందుకు సైతం పలువురు పోటీలో ఉన్నారు.

ఏజెన్సీలో ఏన్కూరు

ఏజెన్సీ ప్రాంతంలోని మార్కెట్ కమిటీలను పీసా చట్టం ప్రకారం రిజర్వేషన్ ప్రాతిపదికన నియమించాల్సి ఉంది. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏజెన్సీలోనిమార్కెట్ కమిటీ పదవులను తమకే కట్టబెట్టాలని కొందరు ఆశ్రయించారు. ప్రధానంగా గిరిజనుల్లో కోయ తెగకు చెందిన ఆదివాసీల నుంచి ఈ డిమాండ్ ఉంది. దీంతో ఏజెన్సీ ప్రాంత మార్కెట్లకు పాలకవర్గాల నియామకం జరగడం లేదు. ఖమ్మం జిల్లాలో ఏన్కూరు ఏజెన్సీ ప్రాంతంలో ఉండగా.. ఇక్కడా అదే సందిగ్ధత నెలకొంది. గతంలోలా మాదిరి ప్రభుత్వం నియామకం చేపట్టకుండా వదిలేస్తుందా.. లేక అన్ని మార్కెట్లతో పాటే పాలకవర్గాన్ని నియమిస్తుందా అన్నది తేలాల్సి ఉంది.

అసలే సగం.. ఆపై ఆగమాగం





నేలకొండపల్లికి చేపపిల్లలు తీసుకొచ్చిన వ్యాన్ వద్ద అధికారులు, మత్స్యకారులు (ఇన్‌సెట్) చిన్నసైజ్ చేపపిల్ల

- చేప పిల్లల పంపిణీలో నిబంధనలకు పాతర
- కాంట్రాక్టర్లు కనికట్టు చేస్తున్నా ఎవరికీ పట్టని వైనం
- జిల్లాలో అస్తవ్యస్తంగా మారిన చేపపిల్లల పంపిణీ

ఖమ్మంవ్యవసాయం/నేలకొండపల్లి: మత్స్యకారులకు ప్రయోజనం కలిగించేలా వంద శాతం సబ్సిడీపై చేపపిల్లలు పంపిణీ చేస్తుండగా.. ఇందులో మాయాజాలం చోటు చేసుకుంటోంది. ఈ ఏడాది సమృద్ధిగా కురిసిన వర్షాలతో జలాశయాలు నిండుగా మారినా చేపపిల్లల పంపిణీలో తీవ్ర జాప్యం జరిగింది. ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదని కాంట్రాక్టర్లు టెండర్లకు దూరంగా ఉండగా.. ఆపై బకాయిలు విడుదల చేయడంతో కాంట్రాక్టర్లు ముందుకొచ్చారు. దీంతో జిల్లాలో 876 జలాశయాల్లో రూ.4 కోట్ల విలువైన 3.50 లక్షల చేపపిల్లల విడుదల చేసే కాంట్రాక్ట్‌ను నేలకొండపల్లి, ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఇద్దరు దక్కించుకున్నారు. అయితే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలో సగం చేప పిల్లలనే విడుదల చేయాలని ఆదేశించగా.. జిల్లాలో రూ.2కోట్ల విలువైన 1.75 కోట్ల చేప పిల్లల పంపిణీ ఈనెల 4వ తేదీ నుంచి మొదలైంది.

రెండేళ్ల తర్వాత పంపిణీ

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో గడిచిన రెండేళ్లుగా చేపపిల్లల పంపిణీ జరగలేదు. పిల్లల పంపిణీలో అక్రమాలను గత కలెక్టర్ గౌతమ్ గుర్తించడం.. కాంట్రాక్టర్లు నిర్దేశించిన లక్ష్యం కన్నా తక్కువ సంఖ్యలో పిల్లలను తీసుకొచ్చినట్లు తేలడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ఇంతలోనే గౌతమ్ బదిలీపై వెళ్లారు. అయితే, ఈ ఏడాదైనా మత్స్యకారులకు ప్రయోజనకరంగా చేపపిల్లల పంపిణీ జరుగుతుందని భావిస్తే అందుకు విరుద్ధమైన పరిస్థితి ఎదురుకావడం గమనార్హం.

నీళ్లలో కలుస్తున్న నిబంధనలు

చేపపిల్లల పంపిణీకి ప్రభుత్వం రూపొందించిన విధివిధానాలను కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదు. 80–100 మి.మీ.లు, 35–40 మి.మీ.ల చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం అనుమతించింది. ఇందులో భాగంగా 80–100 మి.మీ.ల సైజు చేప పిల్లలను ఒక కిలో తూకం వేసి అందులో 250 నుంచి 300 పిల్లలు ఉండాలని.. 35–40 మి.మీల సైజు చేప పిల్లలు ఒక ప్యాకెట్‌లో 200 నుంచి 300 వరకు పిల్లలు ఉండాలని నిర్దేశించారు. కానీ కాంట్రాక్టర్లు జలాశయాల వద్దకు చేపపిల్లలను తీసుకొచ్చిన సమయాన హడావుడి సృష్టిస్తూ మత్స్యకారులు ఉన్నా, లేకున్నా వదిలేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 87 జలాశయాల్లో 18.50 లక్షల చేపపిల్లలను వదిలితే పలు చోట్ల ఇలాంటి విమర్శలే వచ్చాయి. నేలకొండపల్లి మండలంలో చెరువుమాదారం, బాలసముద్రం, కట్టలమ్మ చెరువు తదితర జలాశయాల్లో చేప పిల్లల పంపిణీ సక్రమంగా జరగలేదని స్థానిక మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.

కనబడని కమిటీ సభ్యులు

జలాశయం సామర్థ్యం ఆధారంగా చేపపిల్లల పంపిణీ పరిశీలనకు కమిటీలను ఏర్పాటుచేశారు. ఈ కమిటీ సభ్యుల నేతృత్వంలోనే చేపపిల్లలను లెక్కించి వదలాలి. చిన్న చెరువులు, కుంటల్లో చేప పిల్లల పంపిణీ కమిటీలో మత్స్య శాఖ అధికారి, గ్రామపంచాయితీ కార్యదర్శి, ఏఈఓతో పాటు మత్స్య సహకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, మధ్య తరహా జలాశయాల కమిటీలో మత్స్యశాఖ అధికారి, ఎంపీడీఓ, ఏఈ, మత్స్య సహకార శాఖ అధ్యక్ష, కార్యదర్శులు, రిజర్వాయర్లు, పెద్ద చెరువుల్లో పంపిణీ కమిటీలో జిల్లా మత్స్యశాఖ అధికారి, ఇరిగేషన్ జిల్లా అధికారి, జిల్లా పంచాయితీ అధికారి, ముగ్గురు లైసెన్స్‌డ్ మత్స్యకారులు కమిటీలో ఉంటారు. అయితే, మత్స్య సహకార సంఘాల ప్రతినిధులు, మత్స్య శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు మినహా ఇతర శాఖల అధికారులు కానరావడం లేదు.

5లక్షలకు బదులు 81వేలే...

నేలకొండపల్లిలోని బాలసముద్రం చెరువుతో పాటు కట్టలమ్మ చెరువు విస్తీర్ణం ఆధారంగా రెండింట్లో కలిపి దాదాపు 5లక్షల చేప పిల్లలు విడుదల చేయాల్సి ఉంది. కానీ శుక్రవారం కాంట్రాక్టర్ ఓ డీసీఎం వ్యాన్‌లో 10 డ్రమ్ముల్లో చేపపిల్లలు తీసుకొచ్చాడు. ఒక్కో డ్రమ్ములో 7వేల నుంచి 8వేల వరకు చేప పిల్లలు ఉంటాయని మత్స్యకారులు చెబుతుండగా దాదాపు 81 వేల వరకే ఉన్నట్లు లెక్క. ఇప్పటికే ఆలస్యం కావడం, మళ్లీ తక్కువ సంఖ్యలో అది కూడా 3 నుంచి 4 ఇంచ్‌ల సైజ్ పిల్లలనే వదులుతుండడంతో నష్టపోతామని వాపోతున్నారు. ఈ పిల్లలు 300 గ్రాములకు మించి పెరగవని తెలిపారు. అంతేకాక లెక్కలు కూడా చెప్పకుండా అధికారులు తోచింది రాసుకుని వెళ్లారని, నేలకొండపల్లిలో మధ్యాహ్నం వరకు పడిగాపులు కాస్తే ఆతర్వాత హడావుడిగా చేపపిల్లలు వదిలారని ఆరోపించారు.

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే

ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనల ప్రకారం చేపపిల్లల పంపిణీ జరుగుతోంది. నిర్దేశిత లక్ష్యంలో సగం మేర చేపపిల్లలు వదులుతున్నాం. సైజు, సంఖ్యలో తేడా రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అక్రమాలకు తావు లేకుండా కమిటీల సమక్షంలోనే ప్రక్రియ చేపడుతున్నాం.

– శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి

మత్స్యకారులకు నష్టం..



చేప పిల్లలు తక్కువ సైజ్‌లో ఉండడంతో అవి 300గ్రాములకు మించి పెరిగే అవకాశం లేదు. ఇప్పటికే నాలుగు నెలల సమయం నష్టపోయాం. మళ్లీ నాసిరకం చేప పిల్లలు అందించి మాకు నష్టం చేస్తున్నారు. జిల్లా అధికారులు ఈ అంశంపై విచారణ చేపట్టాలి.

– మైశా శంకర్, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు, నేలకొండపల్లి

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

- రేపటి నుంచి కేంద్రాల ప్రారంభం
- జిల్లా సహకార అధికారి గంగాధర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి గంగాధర్

ఖమ్మంవ్యవసాయం: వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా సహకార అధికారి జి.గంగాధర్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన సన్నాహక సమావేశంలో పీఏసీఎస్ బాధ్యులకు ఆయన సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించడమే కాక గన్నీ బ్యాగులు, ప్యాడీ క్లీనర్లు, తేమ యంత్రాలు, తూకం యంత్రాలు సమకూర్చుకోవాలని తెలిపారు. రైతుల కోసం టెంట్, తాగునీరు, కుర్చీలు ఏర్పాటుచేయాలని చెప్పారు. అకాల వర్షాల దృష్ట్యా టార్పాలిన్లు సిద్ధం చేసుకోవాలని, సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్న విషయమై విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. సోమవారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని చెప్పారు. సన్నరకం ధాన్యం నాణ్యత వివరాలను ఏఈఓలు ధ్రువీకరించనుండగా, ఆ పత్రంతో పాటు ధాన్యం రకం, పరిమాణం, నాణ్యతను పరిశీలించాక కాంటా వేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేశాక ఆన్‌లైన్ లో నమోదు చేస్తే రైతులకు 48 గంటల్లో నగదు జమ అవుతుందని సహకార అధికారి గంగాధర్ తెలిపారు. ఈ సమావేశంలో సహకార శాఖ ఉద్యోగులు ఎండీ.ఆసీఫ్ అన్వర్, టి.వెంకటేశ్వర్లు, రాంచందర్, పీఏసీఎస్‌ల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరే లక్ష్యం

అన్నదాతలకు మద్దతు ధర అందించడమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని మార్క్‌ఫెడ్ డైరెక్టర్, జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు సూచించారు. ఖమ్మం డీసీఎంఎస్ కార్యాలయంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీఎంఎస్ ద్వారా ఎనిమిది మండలాల్లో 30 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వం గ్రేడ్ 'ఏ'రకం ధాన్యం క్వింటాకు రూ. 2,320, సాధారణ రకానికి రూ.2,300గా ధర నిర్ణయించిందన్నారు. ఈసమావేశంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ కె.సందీప్, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ పి.రాంచందర్‌రావు పాల్గొన్నారు.

ముగిసిన జోనల్ స్థాయి క్రీడాపోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు,పక్కన ఐటీడీఏ పీఓ రాహుల్

పాల్వంచరూరల్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన పాఠశాలల విద్యార్థులకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలల నుంచి బాలబాలికలు పోటీలకు హాజరై సత్తా చూపారు. భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం కిన్నెరసానిలోని ఆశ్రమ క్రీడా పాఠశాలలో మొదటి రోజు బాలికలకు, రెండో రోజు బాలురకు పోటీలు నిర్వహించగా శనివారం కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, ఆర్చరీ, ఖోఖో తదితర పోటీల్లో 400 మంది బాలురు హాజరయ్యారు. పోటీల ముగింపు సమావేశానికి హాజరైన ఐటీడీఏ పీఓ రాహుల్ మధ్యాహ్నం విద్యార్థులతో కలిసి భోజనం చేసి మెనూపై ఆరా తీశారు. అలాగే, సమావేశంలో భద్రాచలం తెల్లం వెంకట్రావు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఎనిమిది అంశాల్లో ప్రతిభ చూపిన 240 మందిని క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఐటీడీఏ డీడీ మణెమ్మ వెల్లడించారు.

అత్యంత ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- ఆలోచించే వారిపై నిర్బంధం ప్రయోగిస్తున్న రాజ్యం
- ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభలో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్

ఖమ్మంవన్‌టౌన్: ప్రజాస్వామ్యం అత్యంత ప్రమాదంలో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో దుర్మార్గాలను ప్రశ్నించే వారిపై రాజ్యం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు. ఇటీవల మృతి చెందిన ప్రొఫెసర్ జీఎన్.సాయిబాబా సంస్మరణ సభ ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం ప్రత్యామ్నాయ పౌర సమూహం(సీఏఏ) కన్వీనర్ స్పర్శ భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సాయిబాబా చిత్రపటం వద్ద నివాళులర్పించగా సీసీఏ బాధ్యుడు ఐవీ.రమణారావు రాజ్యాంగ పీఠికను చదివించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సీపీఎం నాయకుడు ఎర్రా శ్రీకాంత్, ప్రముఖ వైద్యుడు ఎంఎఫ్ గోపీనాథ్‌తో పాటు వివిధ పార్టీలు, సంఘాల నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఆవునూరి మధు, యలమంచిలి రవీంద్రనాథ్, పోపూరి రవిమారుత్, బండారు రమేష్ మాట్లాడారు.

కుట్రపూరిత చట్టాలు.. హింస

తొంభై శాతం దివ్యాంగుడైన సాయిబాబుపై రాజ్యం కుట్రపూరితమైన చట్టాలను ప్రయోగించి పదేళ్ల పాటు తీవ్రంగా హింసించిందని వక్తలు పేర్కొన్నారు. హృద్రోగంతో బాధపడుతున్న ఆయనకు సరైన చికిత్స అందించకపోగా, తల్లి చివరిచూపునకు సైతం అనుమతించలేదని తెలిపారు. తమకు అనుకూలంగా వ్యవహరించే వారికి తరచూ పెరోల్‌కు అనుమతించే ప్రభుత్వం.. ఆదివాసీల హక్కులపై నినదించిన ప్రొఫెసర్ సాయిబాబా విషయంలో అమానవీయంగా ప్రవర్తించిందని చెప్పారు. సాయిబాబాది రాజ్యం చేసిన హత్యేనని తెలిపారు. ప్రశ్నించే వారిపై ఈ ప్రభుత్వం కేసులు పెట్టి అణచివేస్తున్న నేపథ్యాన అంతా ఐక్యంగా ప్రజాపోరాటాలు నిర్వర్తించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. ఈ సభలో వినుకొండ మనోహర్ రాజు, పేర్ల మధు, దేవిరెడ్డి విజయ్, ఆవుల అశోక్, మేకల సుగుణారావు, బాలబోయిన విజయ్, బచ్చలికూర ఝాన్సీ, మంగతాయి, చిర్రా రవి, కొమ్ము రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'సుద్దాల' పురస్కారం అందుకున్న అరుణోదయ నాగన్న



నాగన్న దంపతులను సన్మానిస్తున్న హైకోర్టు జడ్జి భీమపాక నగేష్, సుద్దాల అశోక్‌తేజ

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజా గాయకుడు, సాంస్కృతిక విప్లవోద్యమకారుడు అరుణోదయ నాగన్న(పరకాల నాగయ్య)ను సుద్దాల హనుమంతు–జానకమ్మ జాతీయ పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య కళా నిలయంలో సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యాన శనివా టరం నాగన్న – లక్ష్మక్క దంపతులకు హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్, సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ పురస్కారం అందజేసి సన్మానించారు. అనంతరం నాగన్నపై రాసిన పాటలతో రూపొందించిన సీడీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి పలువురు కళాకారులు హాజరయ్యారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి

కొణిజర్ల: రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అర్హత కలిగిన ఉపాధ్యాయులంతా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చావా రవి సూచించారు. కొణిజర్ల మండలం తనికెళ్లలోని మైనార్టీ గురుకులం, జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలను సంఘం నాయకులు శనివారం సందర్శించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చావా రవి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై శాసనమండలిలో గొంతు వినిపిస్తున్న టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరో మారు గెలిపించాలని కోరారు. కాగా, గురుకులాల ఉపాధ్యాయులు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించడమే కాక హెల్త్‌కార్డులు జారీ చేయాలని, గురుకులాల్లో కేర్ టేకర్లు, డిప్యూటీ వార్డెన్లను నియమించి ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ రంజాన్, నాయకులు మహేష్, లివింగ్‌స్టన్, వీరస్వామి, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అండర్-14 టీ.టీ. జట్ల ఎంపిక



బాలికల జట్టుతో సంఘం బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లా స్థాయి పాఠశాలల టేబుల్ టెన్నిస్ జట్లను శనివారం ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం ఎంపిక చేశారు. జిల్లా పాఠశాలల క్రీడా సంఘం కార్యదర్శులు కె.నర్సింహామూర్తి, వి.నరేష్, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి వి.సాంబమూర్తితో పాటు పరిటల చలపతి తదితరులు పోటీలను పర్యవేక్షించారు. ఇక్కడ ఎంపిక చేసిన జట్లు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. బాలుర జట్టుకు షేక్ సోహెల్, గైరిశెట్టి చార్విక్, హితేష్, తరుణ్, హరి, సోమశేఖర్, ఎం.డీ.అనాస్, బాలికల జట్టుకు బి.సాయి శివానీ, షేక్ జవేరియా, డి.ఉజ్వల, అక్షయ, పి.హర్షిత, షేనీ, రోజాషా ఎంపికయ్యారని వెల్లడించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

బోనకల్: గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం ఏర్పడకుండా ప్రత్యేక దృష్టి సారించాలని డీపీఓ ఆశాలత పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బోనకల్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జాతీయ పంచాయతీ అవార్డుకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. కేంద్ర బృందం రెండు, మూడు రోజుల్లో జిల్లాలో పర్యటించనున్న నేపథ్యాన పారిశుద్ధ్యం విషయంలో లోపాలను సరిచేయాలని తెలిపారు. అంతేకాకుండా ఇంటి పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని డీపీఓ ఆదేశించారు. డీఎల్పీఓ రాంబాబు, ఎంపీడీఓ రమాదేవి, ఎంపీఓ శాస్త్రి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మీ ప్రతినిధిని.. ఎప్పుడైనా కలవొచ్చు..

- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి
- సత్తుపల్లి, వైరాలో కాటమయ్య కిట్ల పంపిణీ
- పాల్గొన్న ఎమ్మెల్యేలు రాగమయి, రాందాస్‌నాయక్

సత్తుపల్లి: గీత కార్మికులు చెట్లు ఎక్కిదిగే సమయాన ప్రమాదాల బారిన పడకుండా కాటమయ్య రక్షణ కవచం కిట్లు రూపొందించారని, ఈ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి సూచించారు. సత్తుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి వంద మంది గీత కార్మికులకు కిట్లు, 216మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కిట్ల వాడకంపై అవగాహన ఉందా, వీటితో రక్షణ లభిస్తుందా అని గీతకార్మికులను ఆరా తీశారు. ఏ సమస్య ఉన్నా ఖమ్మంలోని తన కార్యాలయానికి రావొచ్చని తెలిపారు. ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని తెలిపారు. అందులో భాగంగా గీత కార్మికులకు రూ.15వేల విలువైన కిట్లు అందజేస్తున్నట్లు చెప్పారు.



వైరాలో గీతకార్మికులకు కిట్లు అందిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఎంబీబీఎస్ విద్యార్థులకు చేయూత

ఎంబీబీఎస్ సీటు సాధించిన 21 మందికి ఆషా స్వచ్ఛంద సంస్థ ద్వారా రూ.5వేలు చొప్పున ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్ అందించారు. ఈ కార్యక్రమాల్లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ అధికారిణి జ్యోతి, ఆర్డీఓ రాజేంద్రగౌడ్, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, మార్కెట్‌చైర్మన్లు, నాయకులు దోమ ఆనంద్‌బాబు, భాగం నీరజాదేవి, చల్లగుళ్ల నర్సింహారావు, ఉడతనేని అప్పారావు, నారాయణవరపు శ్రీనివాస్, గాదె చెన్నారావు, శివవేణు, ఎండి కమల్ పాషా, ఎస్.కే.మౌలాలీ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

వైరా: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి గీత కార్మికులకు కాటమయ్య కిట్లను పంపిణీ చేసిన ఆయన మాట్లాడారు. గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా కిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వైరా రిజర్వాయర్‌లో చేపపిల్లలు విడుదల చేశారు. మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు షేక్ రహీం, కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, శీలం వెంకటనర్సిరెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో ఎంబీబీఎస్ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందచేస్తున్న ఎమ్మెల్యే రాగమయి దయానంద్, పక్కన ఎంపీ రఘురాంరెడ్డి

అటానమస్ విధివిధానాల అమలుపై సదస్సు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఇటీవల పలు కళాశాలలకు అటానమస్ హోదా లభిస్తోంది. ఈ నేపథ్యాన ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల ఐక్యూఏసీ, కామర్స్ విభాగాల ఆధ్వర్యాన శనివారం 'గవర్నెన్స్ ఆఫ్ అటానమీ' అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా మాట్లాడుతూ సత్తుపల్లి, పాల్వంచ, భద్రాచలం, ఖమ్మం కవితా మెమోరియల్ కాలేజీతో పాటు మహబూబాబాద్, మణుగూరు, తదితర కళాశాలలకు అటానమస్ హోదా లభించిందని తెలిపారు. ఆయా కళాశాలల్లో అధ్యాపకులు సిలబస్ రూపకల్పన, సెమిస్టర్ విధివిధానాలు, పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడితో పాటు సర్టిఫికెట్ కోర్సుల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. యూజీసీ మార్గదర్శకాలను ప్రతీ కళాశాలలో అమలుచేయాలని తెలిపారు. ఈ సదస్సులో వివిధ విభాగాల బాధ్యులు రమాసత్యవతి, పి.సర్వేశ్వరరావు, డాక్టర్ బానోత్ రెడ్డి, డాక్టర్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జకీరుల్లా

నంబర్ ప్లేట్ లేని 55 వాహనాలు సీజ్

ఖమ్మంక్రైం: ప్రతీ వాహనానికి రిజిస్ట్రేషన్ చేయించడమేకాక తప్పక నంబర్ ప్లేట్ బిగించుకోవాలని, లేనిపక్షంలో కేసు నమోదు చేస్తామని ట్రాఫిక్ ఏసీపీశ్రీనివాసులు తెలిపారు. ఖమ్మంలో శనివారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నంబర్ ప్లేట్, రిజిస్ట్రేషన్ లేని 55 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. అనంతరం యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చిన ఏసీపీ మాట్లాడుతూ ఇటీవల చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నిందితులు పోలీసులు, సీసీ కెమెరాలకు చిక్కకుండా నంబర్ ప్లేట్లు తొలగిస్తున్నారని తెలిపారు. అంతేకాక కొందరు చోరీ చేసిన వాహనాలను నకిలీ పత్రాలతో విక్రయిస్తున్నారని చెప్పారు. ఈమేరకు ప్రతీ యజమాని విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకుని నంబర్‌ప్లేట్ బిగించుకోవాలని, సెకండ్‌హ్యాండ్‌వాహనాలు కొన్నా, అమ్మినా పేరు మార్పించుకోవాలని సూచించారు. కాగా, మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై ఎంవీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. తనిఖీల్లో ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు, ఆర్‌ఐలు సాంబశివరావు, సాంబశివరావు, ఎస్ఐలు రవి, సాగర్, రాము, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

న్యూడ్ వీడియోకాల్స్ కలకలం

తల్లాడ మండలంలో ఇద్దరు నేతలకు ఫోన్లు

తల్లాడ: తల్లాడలో శుక్రవారం అర్ధరాత్రి న్యూడ్ వీడియోకాల్స్ కలకలం సృష్టించాయి. మండంలో ఒకే పార్టీకి చెందిన ఇద్దరు నాయకులకు అర్ధరాత్రి దాటాక ఓ నంబర్ నుంచి వీడియో కాల్స్ వచ్చాయి. ఈ ఫోన్లు లిఫ్ట్ చేయగా మహిళ నగ్నంగా ఉండడంతో నివ్వెరబోయి నేతలు కట్ చేసినట్లు తెలిసింది. అయితే, ఈ నంబర్ ఎవరితో తెలుసుకునేందుకు ప్రయత్నించగా ఐడియా హిమాచల్‌ప్రదేశ్ అనే మాత్రమే కనిపించడంతో పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

నేడు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు ఎఫ్‌సీఐ గోదాం ఎంబీ గార్డెన్స్‌లో జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఆతర్వాత శ్రీరాంనగర్ రోడ్డు నంబర్-3, సాయంత్రం రఘునాథపాలెం మండలం శివాయిగూడెం, ఉదయ్‌నగర్, మంచుకొండ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం రాత్రి 7-30గంటలకు గ్రానైట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి పాల్గొంటారు.

ఖమ్మం మార్కెట్‌లోకి బజాజ్ సీఎన్జీ బైక్

కేటీఎమ్ డ్యూక్ 200 సీసీ బైక్, మహీంద్రా తార్ రాక్స్ కూడా..

ఖమ్మంఅర్బన్: సీఎన్జీ ద్వారా నడిచేలా బజాజ్ కంపెనీ రూపొందించిన ఫ్రీడమ్ బైక్‌ను శనివారం ఖమ్మం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఖమ్మంలోని వెంకటరమణ ఆటోమొబైల్స్‌లో వాహనాలను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య విడుదల చేసి మాట్లాడారు. పెట్రోల్, డీజిల్ వాహనాలతో కాలుష్యం పెరుగుతోందని ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుండడం వల్ల ఎలక్ట్రిక్, సీఎన్జీ వాహనాలు ప్రజలు వినియోగిస్తున్నారని తెలిపారు. వాహనాలకు బీమా కడుతున్న మాదిరే మున్సిపల్ పన్నులు చెల్లించి ప్రజలు ఖమ్మం అభివృద్ధికి సహకరించాలని సూచించారు. అనంతరం వీవీసీ సంస్థల అధిపతి వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బజాజ్ కంపెనీ సీఎన్జీ బైక్ పెట్రోల్, సీఎన్జీతో పనిచేస్తుందని, బ్యాటరీ లైఫ్ ఇండికేషన్, బ్లూటూత్ కనెక్టివిటీతో మిస్సిడ్ కాల్ నోటిఫికేషన్ ఉంటాయని తెలిపారు. ఈ బైక్ ఎక్స్ షోరూం ధర రూ.94,995గా ఉందన్నారు. ఇక కేటీఎమ్‌లో సరికొత్తగా రూపొందించిన డ్యూక్ 200 సీసీ బైక్‌ను ఖమ్మం టూ టౌన్ సీఐ బాలకృష్ణ విడుదల చేశారు..



తార్ వాహనాన్ని విడుదల చేస్తున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్, వీవీసీ గ్రూప్ అధినేత రాజేంద్రప్రసాద్ తదితరులు

మహీంద్రా తార్ రాక్స్..

మహేంద్ర మహీంద్రా కంపెనీ ఐదు డోర్లు, ఆరు ఎయిర్ బ్యాగ్‌లతో రూపొందించిన మహీంద్రా తార్ రాక్స్ వాహనాన్ని షోరూంలో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య విడుదల చేశారు. వీవీసీ గ్రూప్స్ ఎండీ రాజేంద్రప్రసాద్ వాహనం ప్రత్యేకతలను వివరించారు.

పిడుగుపాటుతో నలుగురు కూలీలకు అస్వస్థత

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడుతండాలో శనివారం సాయంత్రం పిడుగు పడడంతో సమీప ప్రాంతంలో మిర్చి చేనులో కలుపు తీస్తున్న నలుగురు కూలీలు అస్వస్థతకు గురయ్యారు. గ్రామానికి చెందిన భూక్యా శారద, భూక్యా దేవి, ధరావత్ జీజా, ధరావత్ సరోజ మిర్చి పంటలో కలుపు తీస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వర్షం మొదలై పిడుగు పడడంతో స్పృహ కోల్పోయారు. దీంతో వీరిని 108లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా ముగ్గురు కోలుకున్నారు. కానీ శారద పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కుటుంబీకులు ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా, కూలీలను యువజన కాంగ్రెస్ నాయకులు గుగులోత్ సురేష్ తదితరులు పరామర్శించారు.

వైఎన్.పురంలో పిడుగు..

కల్లూరు: మండలంలోని యజ్ఞ నారాయణపురంలో శనివారం సాయంత్రం సామినేని పల్లయ్య ఇంటి ఎదురుగా ఉన్న నేరేడు చెట్టుపై పిడుగు పడింది. దీంతో పెద్దశబ్దం రాగా గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనతో పలువురి ఇళ్లలోని 16 ఫ్యాన్లు కాలిపోగా, ఇంకొందరి ఇళ్లలో విద్యుత్ మీటర్లు దగ్ధమయ్యాయి. అయితే, పిడుగు పడిన ప్రాంతం వద్ద ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

అటవీ ఉద్యోగి ఆత్మహత్య



ముకుంద (ఫైల్)

ఖమ్మంఅర్బన్: ఖమ్మం శ్రీనగర్‌కాలనీలోని ఒక అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న అటవీ ఉద్యోగి లకావత్ ముకుంద (50) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి జిల్లా పాల్వంచలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ముకుంద భార్య, పిల్లలు ఊరు వెళ్లగా.. తలుపులు వేసుకుని పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. అయితే, ఆయన ఎంతకూ తలుపులు తీయకపోవడంతో సమీప ప్లాట్ల యజమానులు ఇచ్చిన సమాచారంతో భార్యాపిల్లలు చేరుకుని బలవంతంగా తలుపులు తీయగా ముకుంద మృతి చెందినట్లు గుర్తించారు. ఖమ్మం అర్బన్ ఎస్ఐ వరాల శ్రీను చేరుకుని మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. అయితే, ముకుంద ఎప్పుడు, ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో తెలియాల్సి ఉంది. ఘటనపై తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

బీమా పరిహారం చెల్లించండి

ఖమ్మంలీగల్: వాహనం కారణంగా జరిగిన నష్టానికి గాను ఫిర్యాదికి బీమా నగదుతో పాటు పరిహారం, ఖర్చులు చెల్లించాలని ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఎ.మాధవీలత తీర్పు ఇచ్చారు. శనివారం వెలువరించిన ఈ తీర్పు వివరాలు.. భద్రాద్రి జిల్లాలోని పాల్వంచకు చెందిన కిశోర్ కన్‌స్ట్రక్షన్స్ యజమాని కిశోర్ తన టిప్పర్‌ను ఓ కంపెనీలో రవాణాకు ఉపయోగించాడు. అంతేకాక 2022 నవంబర్ 16న టిప్పర్‌కు చోళ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా బీమా చేయించాడు. కాగా, 2023 సెప్టెంబర్ 27న టిప్పర్ ప్రమాదానికి గురైన విషయాన్ని బీమా కంపెనీకి తెలియచేసినా స్పందించలేదు. దీంతో కిశోర్ తన న్యాయవాది ముప్పా నాగేశ్వరరావు ద్వారా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించాడు. ఈ మేరకు బీమా కింద రూ.1.37 లక్షలతో పాటు నష్టపరిహారం రూ.10 వేలు, ఖర్చుల కింద మరో రూ.10 వేలు చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

150 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కూసుమంచి: లారీలో అక్రమంగా తరలిస్తున్న 150 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం తెల్లవారుజామున టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పక్కాగా అందిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ వెంకటేష్ ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టగా మండలంలోని పెరికసింగారం - మల్లేపల్లి మధ్య లారీ పట్టుబడింది. ఈమేరకు లారీని కూసుమంచి పోలీస్‌స్టేషన్‌కు తరలించి బియ్యాన్ని సివిల్ సప్లయీస్ అధికారులకు అప్పగించారు. పలువురు వ్యాపారులు వివిధ గ్రామాల్లో సేకరించిన రేషన్ బియ్యాన్ని పెరికసింగారంలో నిల్వ చేసి అక్కడ నుండి కోదాడ తరలించే ప్రయత్నాల్లో ఉండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోగా, విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుపతిరావు, ఎస్సైలు మహేష్, కిరణ్‌కుమార్‌తో పాటు కూసుమంచి ఎస్సై నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కింగ్ చేసిన కారు దగ్ధం



కాలిపోతున్న కారు

ఖమ్మం అర్బన్: ఖమ్మంలోని జిల్లా కోర్టు ప్రహరీ పక్కన పార్కింగ్ చేసిన కారు శనివారం రాత్రి దగ్ధమైంది. ఒక్కసారిగా మంటలు మొదలై అంతకంతకు పెరుగుతుండడంతో కారు పక్కన పార్క్ చేసిన వాహనదారులు, చిరువ్యాపారులు పరుగులు తీశారు. ఖమ్మం ఫైర్ అధికారి నాగరాజు తెలిపిన వివరాలు... శ్రీ సాయిఅంజని చిట్స్‌కు చెందిన స్విఫ్ట్ డిజైర్ కారును వి.నరేష్ తీసుకొచ్చి పార్కింగ్ చేశాడు. ఆపై పది నిమిషాలకే మంటలు అంటుకుని కారు లోపలి భాగం, ఇంజన్ కాలిపోయాయి. షార్ట్‌సర్క్యూట్‌తోనే ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. కాగా, కారు కాలిపోయిన ప్రాంతంలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండగా ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈఘటనతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా పోలీసులు చేరుకుని రాకపోకలను క్రమబద్ధీకరించారు.

రూ.99వేలు కొట్టేసిన వ్యక్తి

ఫోన్ పే ద్వారా తన నంబర్‌కు బదలాయింపు

మధిర: మధిర రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆయుర్వేదిక్ షాపులో సరుకులు కొనుగోలు చేసేందుకు శనివారం వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి యజమాని ఫోన్‌పే నుంచి రూ.99వేలను తన ఖాతాకు బదలాయించుకుని క్షణాల్లో మాయమైన ఘటన ఇది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు... ఆయుర్వేద షాపునకు వచ్చిన నిందితుడు కొన్ని సరుకులు తీసుకోగా బిల్లు రూ.2,500 అయింది. దీంతో ఎదుటి వ్యక్తి తన ఫోన్ పేకు హాయ్ అని మెసేజ్ చేయాలని సూచించగా తనకు రాదని యాజమాని చెప్పడంతో రూ.1 పంపాలని కోరాడు. ఈమేరకు ఆయన రూ.1 పంపిస్తుండగా పాస్‌వర్డ్‌ను గుర్తించిన నిందితుడు ఆతర్వాత ఫోన్ చూస్తానంటూ ఫోన్ పే ద్వారా తనకు రూ.99 వేలు పంపుకున్నాడు. ఆ వెంటనే ఫోన్ ఇచ్చేసి మరికొన్ని సరుకులు చెప్పి అవి తెచ్చేలోగా మళ్లీ వస్తానని హడావుడిగా వెళ్లిపోయాడు. దీంతో అనుమానం వచ్చిన యజమాని తన ఫోన్ చూసుకోగా రూ.99వేలు బదలాయించినట్లు గుర్తించి ఎక్కడ గాలించినా నిందితుడి ఆచూకీ తెలియకపోవడంతో మధిర టౌన్ పోలీసులను ఆశ్రయించాడు.

రైలు నుండి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతదేహాన్ని తరలిస్తున్న శ్రీనివాసరావు

ఖమ్మంక్రైం: రైలు నుండి జారి పడిన గుర్తుతెలియని వ్యక్తి(40) మృతి చెందాడు. జీఆర్‌పీ ఎస్ఐ భాస్కర్‌రావు తెలిపిన వివరాలు... ఖమ్మం - పందిళ్లపల్లి స్టేషన్ల మధ్య సదరు వ్యక్తి గుర్తు తెలియని రైలు నుంచి జారి పడడంతో మృతి చెందాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 58589 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు.

చెరువులో పడి ఒకరు..



వెంకటేశ్వరరావు (ఫైల్)

వేంసూరు: సరదాగా చేపల వేటకు వెళ్లిన వ్యక్తి చెరువులో మునిగి మృతి చెందిన ఘటన మండలంలోని అమ్మపాలెంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల తెలిపిన వివరాలు... అమ్మపాలెం పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు పుచ్చ వెంకటేశ్వరావు(35) శుక్రవారం మధ్యాహ్నం వెళ్లాడు. ఆయన వల పెడుతుండగా ప్రమాదవశాత్తు జారి చెరువులో పడగా అడుగున ఊబిలో కూరుకుపోయి మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న గ్రామస్తులు గజ ఈతగాళ్ల సాయంతో వెంకటేశ్వరరావు మృతదేహాన్ని బయటకు తీశారు. తహసీల్దార్ ఎం.ఎ.రాజు, ఎస్సై శాఖమూరి వీరప్రసాద్ పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా, వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి..

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడు వద్ద కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో కేలోత్ రామారావు(44) మృతి చెందాడు. స్థానికులు కథనం ప్రకారం.. బూడిదంపాడుకు చెందిన రామారావు బ్యాటరీల వ్యాపారం చేస్తుంటాడు. హైదదరాబాద్ వెళ్లడానికి ఆయన బైక్‌పై ఖమ్మం బస్టాండ్‌కు బయలుదేరగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రామారావును ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. రామారావు తండ్రి రత్నం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

మరో ప్రమాదంలో వ్యక్తి..

ముదిగొండ: ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం వాగులోకి దూసుకెళ్లడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ముదిగొండ మండలం వనంవారికిష్టాపురం సమీపానలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వనంవారికిష్టాపురానికి చెందిన బుడుగు బాబు(37) ద్విచక్రవాహనంపై చిరుమర్రి వైపు వెళ్తుండగా ప్రమాదవశాత్తు బైక్ వాగులోకి దూసుకెళ్లింది. దీంతో బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకుని మృతదేహాన్ని ఖమ్మం ఆస్పపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

ఖమ్మంరూరల్: టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు కింద పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం రాంతండాకు చెందిన భూక్యా రవి(40) ఈనెల 11న ఖమ్మం రూరల్ మండలంలోని మంగళగూడెం వస్తున్నాడు. మార్గమధ్యలో మోపెడ్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలో పడిపోయాడు. ఆయనకు తీవ్ర గాయాలు కాగా ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్ తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై రవి భార్య సరోజ ఇచ్చిన ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు ఖమ్మం రూరల్ సీఐ ముష్కస్ రాజు తెలిపారు.

జీవితంపై విరక్తితో బ్యూటీషియన్..

ఖమ్మంక్రైం: జీవితంపై విరక్తి చెందిన ఓ బ్యూటీషియన్ ఆత్మహత్యకు పాల్పడింది. టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు... పెనుబల్లి మండలానికి చెందిన మద్దినేని సరస్వతి(35) భర్త నరేష్‌తో విడిపోయి కొంతకాలంగా ఖమ్మం ఉపేంద్రయ్య నగర్‌లో బ్యూటీషియన్‌గా పనిచేస్తోంది. అయితే, ఆమె కుమారుడు భర్త వద్ద ఉండగా, ఏడేళ్ల కుమార్తె సరిత వద్ద ఉంటోంది. కొంతకాలం నుంచి ముభావంగా ఉంటున్న ఆమె శుక్రవారం అర్ధరాత్రి ఉరి వేసుకోగా, శనివారం ఉదయం కుమార్తె గమనించి అమ్మమ్మకు వీడియోకాల్ చేసి చూపించింది. దీంతో వారు చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా, అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుకు తన బృందంతో వచ్చి ఆమె మృతదేహాన్ని కిందకు దించారు. అయితే, ఘటనపై పోలీసులు కాల్‌డేటా ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

శివాయిగూడెంలో యువకుడు..

రఘునాథపాలెం: మండలంలోని శివాయిగూడెంకు చెందిన జి.కల్యాణ్(23) శనివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మంలోని ఒక ప్రైవేట్ ల్యాబ్‌లో పని చేస్తున్న ఆయన ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. శుక్రవారం రాత్రి కల్యాణ్ ఆ యువతిలో ఫోన్‌లో మాట్లాడిన సమయాన ఘర్షణ పడినట్లు తెలిసింది. ఈమేరకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు చెబుతున్నారు. ఘటనపై కల్యాణ్ తండ్రి సుధాకర్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

భర్త మృతి చెందాడనే మనస్తాపంతో..

ఖమ్మంక్రైం: భర్త మృతి చెందాడనే మనస్తాపంతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఖమ్మం టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... ఏన్కూరు ప్రాంతానికి చెందిన తనికల కృష్ణవేణి(33) బ్యాంక్ కాలనీలోని అపార్ట్‌మెంట్‌లో తన భర్త రామకృష్ణతో కలిసి వాచ్‌మెన్‌గా పనిచేసేది. మూడునెలల క్రితం ప్రమాదవశాత్తు జారి పడిన రామకృష్ణ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. అప్పటినుంచి కృష్ణవేణి వాచ్‌మెన్‌గా పనిచేస్తూ ఇద్దరు పిల్లలతో ఉంటోంది. అయితే భర్త మృతితో కలత చెందిన ఆమె ఈనెల 16న పురుగుల మందు తాగగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కాగా, తల్లిదండ్రుల మృతితో వారి పిల్లలు అనాధలుగా మిగలగా... పోలీసులు కేసు నమోదు చేశారు.